కథా కౌముది

# అవసరం

వెల్చేరు చంద్రశేఖర్, Ethiopia

*వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన 16వ ఉగాది ఉత్తమ రచనల పోటీలో*

*- ఉత్తమ కథానిక విభాగంలో - ప్రశంసాపత్రం పొందిన కథ*

అతను చెప్పింది విని నిశ్చేష్టురాలయింది సహజ. ఏం సమాధానం చెపుతుంది? చెప్పడానికి ఏం మిగిలింది? అసలు విన్న విషయం అలాంటిది జీర్ణించుకోవడం కష్టం! అతనికి తప్పదు కాబట్టి చెప్పాడు. అతడు చెప్పాడు కాబట్టి వింది. కానీ అతనది చెప్పకుండా ఉండవల్సింది. తనది వినకుండా ఉంటే కొంత నయం, పిల్లాడు గాఢంగా నిద్రోతున్నాడు. వాడికి తెలీదు నాన్నేం చెప్పాడో? అమ్మేం విందో. అరవై ఏళ్ళకే ముసలిదై లేవలేని పరిస్థితిలో జీవితాన్ని నెట్టుకొస్తున్న తల్లికి తెలీదు కూతురేం విందో అల్లుడేం చెప్పాడో.. ఆ చిన్న కొంపలో పక్కగా ఉన్న చిన్న గది అద్దెకి ఇస్తున్నప్పుడు. ఆవిడకాలోచన రాలేదు.

ఏడెనిమిదేళ్ళకి తను వినే వార్త దారుణంగా ఉంటుందని, ఆవిడ అనుకోలేదు. ఆవిడేకాదు సహజే ఆ రాత్రి తన జీవితంలో తుఫాను వస్తోంది అనుకోలేదు. హెచ్చరిక లేని తుఫాను!

పిల్లాడి దగ్గర పడుకున్న సహజ మీద, అతని చెయ్యిపడగానే నవ్వుకుంది. అవును నాలుగురోజులయింది. ఏదో పరధ్యానంలో ముభావంగా ఉన్నాడు. ఆఫీసులో ఏదేనా సమస్యేమో? అనుకుంది. రోజంతా ఇంటిపని, పిల్లాడితో తల్లితో అలసిన సహజకి పక్కమీద వాలగానే, నిద్రొచ్చేది. కానీ ఆ రోజు మగతలోకి వెళ్ళకుండానే వంటిమీద భర్త చెయ్యిపడేసరికి, నిద్రని నిలవరించి లేచి కూర్చుంది.

ఆ చీకట్లో భర్త కళ్ళల్లో కదలాడే ఆలోచనల్ని చదవలేకపోయింది. భర్త అవసరానికే లేపాడు అనుకుంది.

'చూడు' అన్నప్పుడతని గొంతులో వణుక్కి, మత్తు దిగిపోయింది. లేచి వెళ్ళి లైటేసి వచ్చి, "ఏమయింది?" అంటూ అతని మొహంలోకి తీక్షణంగా చూసింది.

లైటెయ్యగానే ఆయన తేరుకున్నాడు, సంబాళించుకున్నాడు. అసలు అంత బేలతనం ఎందుకొచ్చిందీ ఆయన్లో అదో పెద్ద ప్రశ్న!

"సహూ నా ఉద్యోగం అయిపోయింది. నేను మళ్ళీ దుర్గాపూర్ పాత ఉద్యోగానికి వెళ్ళిపోతున్నా.." ఓస్ అంతేనా ఈ ఊరు ఈ ఇల్లూ వదిలిపోడానికి నేను వెనుదీస్తానని బాధా? పర్వాలేదు నేను వెనుదీయను.

అతను చెప్తున్నదది కాదు వింటోంటే కాళ్ళకింద భూమి సమూలంగా కదిలిపోయింది.

అతనికి అంతకు ముందే అంటే ఈ ఊరు రాకముందే పెళ్ళయింది. భార్య అతను చేస్తున్న కంపెనీలోనే ఉద్యోగం చేస్తోంది. పిల్లల్లేరు. నేనూ అక్కడ కొస్తే అందరం కలిసే ఉండచ్చు, అదే అతని ఉవాచ. ఆవిడ్ని ఒప్పించే బాధ్యత అతను తీసుకుంటాడు. నా వరకూ మాత్రమే అక్కడ అతని గూటిలో స్థానం. అమ్మని ఎవరికి అప్పచెప్పాలి. ఇదీ సారాంశం.

నన్నేనా ఆవిడ ఎందుకు రానిస్తుంది. ఇంట్లో వండిపెట్టడానికి అతను మా ఇంట్లో అద్దెకి చేరి ఎనిమిదేళ్ళు కావస్తోంది. ఆంధ్రుడు కాడు. చాలా బాగా ఉండేవాడు. పెళ్ళయి ఆరేళ్ళయింది. పెళ్ళయిం తర్వాత తెలిసింది. అతనికి వయసు ఎక్కువ, కానీ సంసార జీవితానికి అదెన్నడూ అడ్డురాలేదు.

సహజ ఆరేళ్ళక్రితం, రెండు జెళ్ళేసుకుని నిలువుబొట్టు పెట్టుకుని, స్నేహితురాళ్ళతో కిలకిలలాడుతూ స్కూలుకెళ్ళేది స్కూలు ఫైనలు చదివేది.

●●●

సహజకి తండ్రిలేడు తల్లే సర్వస్వం.. తల్లి వంటమనిషిగా.. వాళ్ళింట్లో.. వీళ్ళింట్లో పనిచేసి సహజని చదివిస్తోంది. ఇంటి వాళ్ళ అభిమానం సంపాదించి పెద్దకొంపలో ఓ చిన్న గది సంపాదించి దాంట్లో కాలం వెళ్ళదీస్తోంది.

ఆ రోజుల్లోనే ఆ ఇంట్లో ఒక వాటాలోకి హిందూస్తానీ వాడు వచ్చాడు. మనిషి ఎర్రగా చురుగ్గా హుషారుగా ఉన్నాడు. హిందుస్తానీ వాడు హిందూస్తాన్ పోలిమర్స్ అన్న కొత్తకార్ఖానా నిర్మాణానికి వచ్చాడు. మొదట్లో చెయ్యి కాల్చుకోవడానికి ప్రయత్నించి, కుదరక సహజ తల్లిని వండిపెట్టడానికి కుదుర్చుకున్నాడు. కానీ వాడికి తెలుగురాక పోడం, తల్లికి హిందూస్తానీ అర్థంకాక, వాడికీ తల్లికి మధ్యవర్తిత్వం సహజే నడిచేది.

ఆ రోజుల్లోనే సహజ స్కూలు ఫైనలు పాసయింది. కాలేజీ చదువులు చెప్పించే స్తోమత లేక సహజని టీచర్స్ ట్రైనింగ్ జాయిన్ చేసింది తల్లి.

టీచర్స్ ట్రైనింగ్ చేస్తుండగానే హిందుస్తానీ వాడు చనువు పెంచాడు. ఆ చనువుతో మనసు మురిసి తనువు విరిసింది.

ఈ విషయం తల్లికి తెలిసి సహజని కోపగించి కొట్టింది. అప్పుడు ఆ హిందూస్థానీ వాడు దీంట్లో సహజ తప్పేం లేదు. సహజని నేను పెళ్ళిచేసుకుంటాను. అని చెప్పి సహజ తల్లిని ఓదార్చి సహజని పెళ్ళిచేసుకున్నాడు.

ఆ రోజునుండీ సహజ మది ఆనందంతో చిందులేసింది. వడి నిండింది. సహజ టీచర్స్ ట్రైనింగ్ పాసయినా ఉద్యోగం చెయ్యలేదు. హిందూస్తానీ వాడి పంచన చేరి తల్లిని కూడా బైటపనులకి వెళ్ళనివ్వకుండా తనతోనే ఉంచుకుంది. ఆవిడ ఆరోగ్యం కూడా క్షీణించింది.

సహజకిఈ విషయం చెప్పాక, అతను రెండు రోజులు గడువిచ్చాడు. ఏం చెయ్యాలి? అన్న మీ మాంసలో సహజ కొట్టుమిట్టాడిపోయింది. భర్తతో అక్కడికి వెళ్ళడమా? అమ్మతో ఇక్కడ ఉండడమా? అక్కడ తన పరిస్థితి ఏమిటి? తన అస్థిత్వం ఎంతవరకూ నిలుస్తుంది. అక్కడికెళ్ళితే అతని బంధువులు, అతని స్నేహితులు, అతని సమాజం, మొదటి భార్యను చూసినట్లు, రెండో భార్యని చూడరు. భాష వేరు, జీవన విధానం వేరు. సమాజంలో తన స్వంతం కాని మనిషుల మధ్య తను సానుభూతి ఆశించడం. చోటు కోసం వెదుక్కోడం వెర్రిభ్రమ. అయితే ఏం చెయ్యాలి? ఏం చేస్తే బావుంటుంది? అక్కడి కెళ్ళడం కష్టం అయితే వెళ్ళకుండా

ఉండడం కష్టాల్ని కొని తెచ్చుకోవడమే. అక్కడికి వెళ్ళి ఏమీ తెలియని వ్యక్తుల మధ్యా, తెలియని సమాజంలో తన ఉనికి కోసం పోరాడ్డం కన్నా.. ఇక్కడే తెలిసిన వాళ్ళ మధ్య చిన్న చిన్న ఆటుపోట్లు సహిస్తూ బ్రతుకు వెళ్ళదీయడం మంచిది. ఈ బ్రతుక్కి ఇంతే ప్రాప్తం అని సరిపెట్టుకోడం మంచిది అని నిర్ణయించుకుంది.

మొగుడితో రానని చెప్పేసింది. తల్లి దగ్గరే ఉండిపోయింది. హిందూస్తానీ వాడు వాడి మానాన వాడు పోయాడు.

●●●

మంచాన పడ్డ తల్లి మంచాలు కుర్చీలు పట్టుకు నడుస్తున్న, పిల్లాడితో రోజులు గడవడం కష్టం. నీళ్ళమోత ఇతర ఇళ్ళల్లో వంటచెయ్యడం నేర్చుకున్న విద్యవల్ల వంటపట్టిన నాగరికత వల్ల నామోషీ అయిపోయాయి. అప్పుడే టీచర్స్ ట్రైనింగ్ సర్టిఫికెట్ తీసి దుమ్ము దులిపి, తెలిసిన కార్పొరేషన్ ఆఫీసర్ దగ్గర కెళ్ళి ఏదేనా టీచరు పోస్టు ఇప్పించమంది.

ఉద్యోగాలుంటాయి. దానికి మనుషులవసరం అవుతారు. కానీ సహజలు అవసరం కారు. అదే పెద్ద చిక్కు.

ఆయన చేసే మేనేజరు ఉద్యోగంతో ఆమెకి ఉద్యోగం వేయించడం కష్టం. అలాగని కమిషనర్‌గారితో చెపితే ఆయన అలాగే అన్నాడు. సహజ స్వయంగా వెళ్ళి అర్థించిన అభ్యర్థన అతని బంధుప్రీతి ముందు దిగదుడుపే!

ఈ రోజుల్లో ఏదేనా సాధించాలంటే బంధుత్వమో, విత్తమో, ఆడతనమో ఏదో ఒకటి కావాలి. మొగాడికి మూడో దారికూడా కరువైపోతుంది. సహజ గురించి రెండుసార్లు, మేనేజర్ సహజ కూడా కమీషనర్‌ని అడిగారు కానీ ఎక్కడా కుదర్లా..

కమీషనర్ పి.ఎ. చెప్పిన సమాచారాన్ని బట్టి కమీషనర్ దూరపు బంధువు టీచర్ ట్రైనింగ్ చదువుతున్నాడు వాడిది ఈ అక్టోబర్ లో అయిపోతుంది. వాడిని వేసుకునే దృష్టిలో ఉన్నాడాయన అందుకే తాత్కారం చేస్తున్నాడు.

ఆ రోజు సహజ కళ్ళల్లో కన్నీళ్ళు కొలువు.. గొంతులో దైన్యం.

సహజ కమీషర్‌ని కలిసింది. ఎలా కలిసింది? ఎందుకు కలిసింది కలిసినందువల్ల లాభం ఏమిటి? అంచనాని తారుమారుచేస్తూ కలిసింది.

సహజ కమీషనర్‌కి విచిత్రంగా ఎదురుపడింది? 'నేనే టీచర్ పోస్టుకి అప్లైచేసాను.' అంటూ పరిచయం చేసుకుంది. దైన్యంగా, బీడువారిన మొహంతో, కొడిగట్టిన కళ్ళతో నలిగిన చూపు.

అతను పెద్దగా చలించలేదు. ఇలాంటి వాళ్ళని చాలామందిని చూసుంటాడు.

'ఇప్పుడు పోస్టులు ఖాళీగాలేవమ్మా' అన్నాడు.

పోస్టులు ఖాళీవున్నాయని తనకి తెలుసని చెపుతుందా? లేక ఏదోలా నాకు దారి చూపించండి అని బతిమాల్తుందా? అలా బతిమాలడంలో ఓ చిన్నతనం ఉంది. అయినా తప్పదు. తనకథంతా చూచాయగా వినిపించి బతిమాలుకుంది. ఆ కథలో శృంగారం తప్ప, ఇంకేం ఎదుటి మనిషి బుర్రకి ఎక్కదని ఆమెకి తెలీదు.

కాని ఆ కథని అర్థం చేసుకున్న పి.ఎ సహజని కూర్చోబెట్టి పెద్ద లెక్చరిచ్చాడు.

"నిన్ను వాడు సెక్స్‌ప్లాయింట్ చేసాడో ఆ సంపద ఇంకా నీ దగ్గర కొంతైనా పదిలంగా ఉంది. ఉంది అని కమీషనర్‌కి తెలిస్తే చాలు; దాన్ని పంచిపెట్టడానికి కష్టపడుతున్నావని అతనికి అర్థం అయితే నీ సమస్య పరిష్కారం జరిగిపోతుంది."

సహజకి వింటున్నంతసేపూ తనేం వింటోందో అర్థంకాలేదు. చాలా స్పష్టంగా ఉన్న అతని దృష్టి దేనిమీదో అర్థం అయింది. బైటికి వచ్చి రోడ్డుమీద నడుస్తోంటే గ్లోబలైజేషన్ లో "సర్వాంతర్యామిలా" ఎయిడ్స్ ఎడ్వటైజ్ మెంటు కనిపించింది.

ఇంటికి వెళ్ళి పిల్లలని తల్లిని చూసాక, ఏమిటి? తనకు దారి అన్న ఆలోచన కూర్చోనివ్వలేదు. ఏం చెయ్యాలి? ఎంతకాలం ఇలా.

హిందూస్తానీ వాడివెనకాల పోవలసింది? అన్న ఆలోచన చాలా వెంటాడింది కాని ఆ ఆలోచనే వృధా!

ఈ రోజుల్లో అన్ని అమ్ముకోవాలి. లేదా అమ్మడానికి సిద్ధంగా ఉన్నానని తెలియచేయాలి. అందం, శరీరం, ఆలోచన, రాజకీయం, పోరాటం, మంచితనం దయ, సిద్ధాంతం ఉద్యమం ఏది అమ్ముడుపోదు! అన్నీ అమ్ముడు పోతాయి. అయితే అమ్మేవాడు అమ్మకానికి తన దగ్గరేముందో అది ప్రదర్శించాలి. అమ్మేయకూడదు. దాని విలువ రాబట్టాలి. విచిత్రం!

దానికి విలువ స్థిరంగా ఉండదు. విలువ పెరుగుతూ ఉంటుంది. తొందరపడి అమ్మేస్తే విలువ దక్కదు. అలాగని కూర్చుంటే విలువలేకుండా పోతుంది. కాబట్టి విలువ రాబడుతూ వ్యాపారం చెయ్యాలి. ఉన్నది కొంచెం సరుకైనా వ్యాపారానికి పెట్టాలి?

అదెలాగ అని ప్రశ్నిస్తూ కూర్చుంటే కుదరకపోవచ్చు.

●●●

"ఏమే అలాగున్నావ్"

"ఖర్మకాలి"

"ఎందుకే అంతకోపం ఏదో డీలాగా ఉంటే అడిగా దానికే ఇంతకోపమా?" గాద్గదంగా మారిన గొంతు.

"కోపం కాదే. "

"అల్లుడు రెండునెలలనుండి కనబడటంలేదు. ఎక్కడికెళ్ళాడో"

"వాళ్ళ ఊరు"

"మళ్ళీ ఎప్పుడొస్తారట"

"రారు"

"అదేమిటి?"

"ఇక్కడ ఉద్యోగం అయిపోవడం ఏమిటే?"

"ఆయన ఇక్కడకి ఏ పనిమీదొచ్చారో ఆ పని అయిపోయింది".. వెళ్ళిపోయారు.

"మరి నువ్వో"

"వెళ్ళడం లేదు"

"అంటే!"

"నేనాయనతో ఆ ఊరు వెళ్ళను?"

"మరి మొగుడ్ని వదిలేస్తావా?"

"నే వదిలెయ్యలేదు.."

"మరి"

"పట్టుకోనూ లేదు"

"ఎందుకా పొగరు? మొగుడి వెంట వెళ్ళకపోతే ఏం చేస్తావ్?"

"వెళ్ళేం చేస్తాను?"

"అతను కాని రావద్దన్నాడా?"

"లేదు"

"మరి?"

"అతనికి ఇంతకు ముందే పెళ్ళయింది?"

"మరి నిన్ను మభ్యపెట్టి పెళ్ళిచేసుకున్నాడా?"

"నన్ను చేసుకుంటానన్నప్పుడు నేనడగలేదుగా నీకు పెళ్ళయిందా? అని. "

"ఈ ఆరేళ్ళ కాపురం.. పిల్లాడు?"

"అతని అవసరం తీరింది."

"అవసర తీరడం ఏమిటే?"

"అంతకన్నా ఏం చేస్తాం!? ఎక్కడ కెళ్ళి న్యాయం అడుగుతాం, అతగాడి మొదటి పెళ్ళాం దగ్గర కెళ్ళా? ఆవిడ మొగుడ్ని పర్లేదు పంచుకో అంటుందా?"

"వాళ్ళ బంధువులు తల్లీతండ్రి ఉంటారా?"

"ఈయనిక్కడ చేసిన పన్లకి వాళ్ళెందుకు భారం వహిస్తారు?"

"............"

"అయినా వాళ్ళు నా తరుపున మాట్లాడతారని నమ్మకం ఏమిటి? వాళ్ళ భాష ఎమిటి వాళ్ళ సంస్కారం ఏమిటో పెళ్ళినాడు ఇవన్నీ మనకేం అవసరం లేకపోయాయి."

"అయితే?"

"ఇప్పుడు తెలుసుకుని చేసేదేమిటి?"

తల్లి మరి మాట్లాడలేదు. కోపం కసి ఎవరి మీద తన మీద తనకే ఎందుకిలా జరిగింది? ఎందుకిలా జరిగిందో తనకైతే అర్థం కావడంలేదు. ఎందుకు కోపంగా ఉందో!

ఎందుకిలా కసిరేగుతుందో? అర్థం కావడంలేదు. తల్లి దగ్గర బైటపడ్డ కోపం ప్రదర్శించిన తెంపరితనం స్వంతం చేసుకుని.... సహజ ఆలోచన్లు పరిపరివిధానాల పోతున్నాయి.

●●●

మర్నాడు ఆఫీసులో కమీషనర్ పి.ఏ యధాప్రకారం కమిషనరుగారు బిజీ మీరు ఇప్పుడు కలియడానికి వీలుండదు అన్నాడు.

"మరెప్పుడు వీలుంటుంది?"

"ఏమో నాకేం తెలుసు?"

"అంటే నా సమస్యకి పరిష్కారం లేదా?"

"అది నన్ను అడుగుతారేమిటి? నాకేం తెలుసు"

"ఆయన్ని కలవనిస్తే ఆయన్నే అడిగేదాన్ని. మరి మీరు కలవనివ్వడం లేదుగా"

"ఆయనకి ఖాళీ ఉండేటప్పుడు రండి కలుద్దురుగాని"

"ఆయనకెప్పుడు ఖాళీగా ఉంటుందో నాకెలా తెలుస్తుంది?

"...." సమాధానం లేదు.

సహజ చూపు సూటిగా ఉంది.

"మీరు నన్ను నిలదీస్తున్నారేమిటి?"

"ఆయనతో కలవడానికి మీరే అడ్డగిస్తున్నారు కాబట్టి."

"నేనెక్కడ అడ్డు చెప్పాను?"

"ఆయనెప్పుడు ఖాళీగా ఉంటారో ఎప్పుడు కలవచ్చో చెప్పడం లేదుగా?"

"నాకే తెలీదని చెపుతున్నాకదండీ"

"మీరుకమీషనరుకి పిఏ అయివుండీ, కమీషనర్ గారు ఎప్పుడు ఖాళీగా ఉంటారో చెప్పలేకపోతున్నారు. అంటే ఎంత సబబుగా ఉందో ఆలోచించుకోండి"

అతను ఆలోచనల్లో పడ్డాడు. కానీ సహజ చెప్పిందాని గురించి కాదు. ఆడదైపోయింది. లేకపోతే ఈ పాటికి కసిరేసో, విసుక్కునో.. కోపగించో.. బైటికి తగలేసేవాడే వదిలించుకునేవాడే కానీ ఎదురుగా ఆడది? ఎలా వ్యవహరించాలి అన్నదాంట్లో చిన్న సందిగ్ధం.. మూడు రోజులనుండి తిరుగుతోంది. కమీషనర్‌కి చెపితే ఈవిడ గోడు ఎన్నిసార్లు వినాలయ్యా అంటాడు. అసలు పరిస్థితి తెలుసు, విసుక్కుంటాడు పి.ఏ. సందిగ్ధం అర్థం చేసుకుంది సహజ తెగింపుగా మాట్లాడకపోతే కుదిరేటట్టు లేదు అనుకుంది.

మూడు రోజులుగా లేని దూకుడు ఈరోజు ఎందుకు ప్రదర్శిస్తోంది. ఏదో నచ్చచెప్పాలి. నమ్మబలకాలి.

సహజ మొహం కందగడ్డలా ఉంది. చెమటకి తడిసిన నొసటి తిలకం కొంచెంగా కనుబొమల మధ్యకి కారింది. రాసుకున్న పౌడరు. మెడమడతల మధ్య పేస్టులా మెరుస్తోంది. దెబ్బతిన్న కుక్కపిల్లలా మూలగడంలేదు. దెబ్బతీసే పులిలా చూస్తోంది.

"చూడండి రేపు రండి. కమీషనర్ గారి దగ్గరకి పంపుతా. రేపు తప్పకుండా పంపుతా."

అతని మొహంలో సీరియస్‌నెస్‌కి, అతని మాటల్లో ధ్రుఢత్వానికి కొంచెం లొంగింది సహజ. "రేపెన్ని గంటలకి?"

"మధ్యాహ్నం మూడుగంటలకి రండి. అప్పుడైతే ఎవరూ ఉండరు" అన్నాడు.

సహజ ఊరట చెందింది. ఏదో ఆశని తీసుకు వెనక్కి మళ్ళింది.

రేపు నిజంగానే కమీషరుని కలుస్తుందా? అతనేమంటాడు. తనకి ఉద్యోగం ఇస్తాడా? లేక లేదని చెపుతాడా? ఇంటికెళితే తల్లి గొణుగుతుంది. వెళ్ళకపోతే కొడుకు ఎలా ఉన్నాడో? అన్న చింత!

ఇంటికే వెళ్ళింది.

మర్నాడు మూడు గంటలవరకూ ఆరాటమే. కమీషనర్ ఏమంటాడు? ఉద్యోగం ఇస్తానంటాడా? ఇవ్వడా? ఏం జరుగుతుంది. పోష్టు అయితే ఖాళీగా ఉంది. అసలు కమీషనర్ ఏ విధంగా, ఇంప్రెస్ అవుతాడు తను దైన్యంగా అవసరంలో ఉన్నదానిలా ఉండాలా? లేక ఆకర్షించే విధంగా ఉండాలా? ఎలా ఉండాలి. ఎలా కనిపిస్తే తన పని పూర్తవుతుంది? తనేం చెయ్యాలి, కమీషనరుకి ఎలా కనిపించాలి అన్న ఆలోచన మనసుని తినేస్తోంది.

సహజ జీవితంలో మొట్టమొదటిసారిగా కమీషనర్ ఎదురుగా ఎలా కనిపించాలి? అన్న బలమైన అవసరం ముంచుకు రాగా అద్దం ఎదురుగా నిలబడింది.

అద్దంలో ఆకారానికి ఉలిక్కిపడింది. ఈ మధ్య ఆఫీసు చుట్టూ తిరగడం వల్ల మొహం కమిలి నల్లబడింది.

పీక్కుపోయినట్టున్న మొహంలో ఏ మాత్రం ఆకర్షణ లేదు. ఆకర్షణ తర్వాత మాట, తీరుగా కూడా లేదు.

నుదుటిమీద జిడ్డు, అణిగి మణిగి సేదతీరుతున్న కురులు చిన్నగా కమిలిన మొహం, వుగ్గులుగా ఓ ఆకారంలో లేని జాకెట్టు వడిలిన కాడల్లా చేతులు. వెలిసినట్టున్న చీర, చీరమడతల్ని మోయలేనంటున్న నడుం కాలికి మట్టెలు, పొట్టిగా కట్టిన చీర తన ఆకారం తనకే వికారంగా అనిపిస్తోంది!

తనెవర్నీ ఆకర్షించదా? తను ఉద్యోగానికి వెళితే కనీసం తనతో ఎవరూ మాట్లాడటం లేదు. తనకి ఉద్యోగమే కాదు రూపం కూడా అవసరమే. అన్న ఆలోచనలో పడింది. తనతో అవతలి వాళ్ళు మాట్లాడాలి. తను అవతలి వాళ్ళని ఆకర్షించాలి!

నలిపి పారేసిన ప్లాష్టిక్ కాగితంలా ఉండకూడదు. చాక్లెట్‌కి చుట్టిన రేపర్‌లా మెరవాలి ఎలా? ఏం చెయ్యాలి? కూర్చుని జాకెట్‌కి వుగ్గులు లేకుండా కుట్టుకుంది. వేసుకు చూసుకుంది. సరిగా సెట్ అవలేదు అనిపిస్తే మళ్ళీ కుట్టుకుంది. జాకెట్టు ఒంటిమీద బిగుసుకుంటున్న కొద్దీ, షేపులు బైటకి వచ్చాయి. ఆఖరికి జాకెట్టు బాగా సెట్ అయింది. సంతృప్తినిచ్చింది.

ఒక రూపాయి పెట్టి షాంపూ తెచ్చి తలంటుకుంది. మొహం జిడ్డునుండి విముక్తి పొందింది. ఇన్నాళ్ళూ లేని మమకారం శరీరం మీద మొదలయింది. శరీరానికి మెరుగులు కావాలి ఇంకొకళ్ళని ఆకర్షించే మెరుగులు కావాలి. అవి ఎలా వస్తాయి.

నాజూకుగా ఉండాలి. మెళ్ళో బండగా ఉన్న పుస్తెలతాడు తీసేసి సన్నపాటి గొలుసు వేసుకుంది. మెడకో నాజూకుతనం వచ్చింది.

పుస్తె తీస్తున్నప్పుడు తటపటాయించినా, అతడే తనని వదలి వెళ్ళినప్పుడు ఇవి మాత్రం ఎందుకు? అని సమాధానం చెప్పుకుంది. అది తీసేసాక హాయిగా ఉంది, విముక్తి లభించింది.

అతను వెళ్ళిపోయినా మెడలో ఎందుకో ఈ బంధం. ఇది బంధం కాదు ప్రతిబంధకం, ప్రతిబంధకం తీసేసింది. అతని ఆలోచనల్లోంచి విముక్తి అవాలి. అతడు తనని వదిలి వెళ్ళిపోయాడు తను దిన పరిస్థితిలో ఉంది. ఎవరో సహాయం చెయ్యాలి. అన్న మెంటల్ ఆటిట్యూడ్ పోవాలి.

ఏదో ఉద్యోగం ఎలాగొలా సంపాదించాలి. తన్ని తనే నెట్టుకు రావాలి? అదీ సంకల్పం?

●●●

కమీషనర్ ఆఫీసులో అడుగుపెట్టగానే, నిన్నటికి సహజకి ఈ రోజు సహజకి తేడా పసికట్టాడు కమీషనర్ పి.ఎ, అది వాడి కళ్ళల్లో కనబడింది. అంటే తన ఆలోచన కరెక్ట్. దీనత దేవరింపుతో ఈ ప్రపంచంలో బతకలేం. తను ఆడది ఆకర్షణ సహజం దాన్నుపయోగించి పని నెరవేర్చుకోవాలి.

ఎలాగైనా సంకల్పం నెరవేరాలి.

ఈ దారి సరైనదా కాదా? అన్న ఆలోచనకాదు కావలసింది. తన పూర్తి అయిందా లేదా? అన్నదే ముఖ్యం!

కమీషనర్ దగ్గరకి వెళ్ళింది. ఆయన కనీసం తలెత్తయినా చూడలేదు. పట్టించుకోలేదు. ఉద్యోగమా? అంటూ వెర్రిదాన్ని చూస్తున్నట్టు చూసాడు. ఎవరూ తననిపట్టించుకోడం లేదు.

అకస్మాత్తుగా తన ఉనికి చెరిపేసినట్టయింది. తనెందుకూ పనికిరానని నిరూపిస్తున్నారు. తనకి బతికే అవకాశం ఇస్తారా? ఇవ్వరా? ఎవరు ఇవ్వాలి? ఎందుకు ఇవ్వాలి. తన ప్రత్యేకత ఏమిటి? ఆడది కాబట్టి వాడు చిన్న అబద్ధం చెప్పి పెళ్ళిచేసుకున్నాడు. సెక్స్ కోసం కేవలం సెక్స్‌కోసం, కోరిక తీరడం కోసం అవసరం తీరింది. తెప్పతగలలేసాడు, తన జీవితంలో ఇన్ని మార్పులు జరుగుతున్నా తన ప్రమేయం ఏమీ లేకుండా ఉండిపోయింది. ఒంటరిదైపోయింది.

తను ఉద్యోగం సంపాదించాలి ఎలా? ఏదో స్వతంత్రురాలుగా, జీవిద్దామనే ఉబలాటం అదెలా నెరవేరుతుంది? నెరవేర్చేవాళ్ళెవరు? పరిస్థితులు నా పట్ల ఇంత నిర్దయంగా ఎందుకున్నాయి. తన స్నేహంలో, ఆకర్షణలో, పెళ్ళిలో.. దగా ఎందుకు?

ఈ దగాపడ్డ బతుకుని ఇంకా దగా పడనివ్వదల్చుకోలేదు. కమీషనర్ పి.ఎ. చూపుల్లో మార్పు పసిగట్టింది. తను పక్కమీదకి తప్ప పనికిరాదా?

తన భర్త నిరాకరిస్తుందని అనుకోలేకపోయాడు. అతని వెంటపడి వస్తాననే అతని అహంకారం చెప్పింది. వెళ్ళలేదు. అతని ఆలోచన తప్పు అని తేలింది.

పెళ్ళి సాఫీకంగా కాక సేఫ్ ఎరేంజ్‌మెంట్ అయితే అదికూడా కాదని ప్రస్తుతం పరిస్థితులు చాటి చెపుతున్నాయి. తనెందుకు వెనక్కి ఉండిపోవాలి?.

తనెందుకీ స్వేచ్ఛా! ఏం ఒరగబెడుతుంది. ఆత్మాభిమానం ఆత్మగౌరవం అన్నవి అక్కడ ఏ మాత్రం మిగలవని అర్థం అయింది. దానికి వేరే చదువుకోనక్కరలేదు. అందుకే ఈ స్వేచ్ఛ కోరుకుంది. కానీ ఉద్యోగ ప్రయత్నంలో భర్తలాంటి వారినే ఆశయించాలని, వీళ్ళకు తన ఆడతనానికి మించి ఐడెంటిటీ ఉండదని అర్థం చేసుకోలేకపోయింది. అడుగడుగునా భర్త నీడలే! వాడుకుందామన్న ఆలోచన్లే! వీటిని ఎలా తప్పించుకోవాలి. అవసరం ఎలా తీరుతుంది.

తను ఈ ఏకాకి, చుట్టూవున్న పంజరాన్ని చేధించాలి ఎలా? ఈ సాలిటరీ కన్ఫైన్‌మెంటు, ఒంటరి వేదననుండి విముక్తికావాలి. అదెలా సాధ్యం!

ఏకాకితనం ఒక మానసిక రుగ్మత లేక, సాంఘిక రుగ్మతా ఇప్పుడు జరుగుతున్న విచికిత్సలన్నీ సాంఘిక రుగ్మతలకే పరిమితం, కానీ మానసిక రుగ్మత కాదు.

తనని పట్టి పీడిస్తున్న ఈ రుగ్మత ఏమిటి? అదే అర్థం చేసుకోలేకపోతోంది.

"ఎక్కడికే వెళ్ళావు".

"కమీషనర్ ఆఫీసుకి"

"ఆఫీసుకి అలాగే వెళ్ళావా?"

"ఎలా వెళ్ళాను?"

"తలకి కాస్త నూనె రాసి, జడ బిగించి కట్టరాదు"

"అలా బాగోలేదు"

"ఏమిటి బాగు, పిల్లతల్లివి, పిల్ల తల్లిలా ఉండు. తిరుగుబోతు దానిలా ఉండకు"

"తిరుగుబోతు కాస్త మార్పుకే తిరుగుబోతుదాన్లా ఉందా?" ముసలిదాన్ని మంచంలోనే కుమ్మేయ్యాలనుంది. అతనితో వెళ్ళకపోవడానికి సగం కారణం తల్లే! అనిపించినా మళ్ళీ ఎందుకో కాదు! అనిపించింది.

అతని వెనకాల ఎడ్రసు లేకుండా పోవడం ఇష్టంలేదు. ఆలోచన్లకి అడ్డుకట్ట లేస్తూ తల్లి గొణుగుడు వినబడింది.

"ఇంక చాల్లే వాగింది చాల్లే .. ఊరుకో" అంటూ కసిరింది. పెద్దదాన్నని చూడకుండా, కసురుకుంటుంది. అంటూ కళ్ళనీళ్ళెట్టుకుంది. బెక్కుబెక్కుమంది తల్లి.

ఆ బెక్కంటేనే చిరాకు ఏం చెయ్యలేక చీకట్లో తలుపుని బలంగా తన్నింది. ఆ చప్పుడికి తల్లి బెక్కడం ఆపి ఊరుకుంది.

●●●

మర్నాడు కమీషనర్ ఆఫీసుకి వెళ్ళి కమీషనర్‌ని కలిసింది. ఆయనా విసుక్కున్నాడు.

ఇక్కడ ఉద్యోగాలు చెట్లకి కాస్తాయా? ఎన్నిసార్లు తిరిగినా ఉద్యోగం వస్తుంది అనుకోడం బుద్ధిపొరపాటు. నన్ను కలియడం వల్ల లాభంలేదు అంటూ చాలా సేపు చర్చించాడు. కానీ అక్కడ్నించి కదలలేదు.

మొండిగా నిలబడింది. మొండితనం తప్ప మరో మార్గంలేదు. బతకడానికి మరో ఆలోచనరావడం లేదు. ఎలా బతకాలి ఏం చేస్తే డబ్బు సంపాదిస్తాను. రోజు ఎలా గడుస్తుంది? ఇంతమంది ఆఫీసర్లు బతుకు తెరువు చూపించలేకపోతున్నారు.

ఇలా మొండిగా నిలబడితే ఉద్యోగం వస్తుందా?

ఏమయితే అదయింది ఇక్కడనుండి కదిలే ప్రసక్తి లేదనుకుంటోంది. కానీ కమీషనరే పి.ఏ.ని పిలిచాడు

"కోళ్ళ అప్పలనాయుడుతో చెప్పి చూడవయ్యా ఏదోలా సర్దమను" అన్నాడు.

●●●

**Click here to share your comments on this story**